## క్లుప్తంగా

### బాల కార్మిక వ్యవస్థను రూపుమాపుదాం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సదుం: బాలకార్మికుల వ్యవస్థను రూపుమాపేందుకు అందరూ సహకరించాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ జగదీశ్ బాబు కోరారు. బాల కార్మికులను గుర్తించేందుకు శుక్రవారం మండల కేంద్రంలోని దుకాణాలు, హోటళ్లలో ఆయన తనిఖీలు చేశారు. అధికారుల ఆదేశాల మేరకు ఈనెలాఖరు వరకు తనిఖీలు చేస్తామన్నారు. బడి ఈడు పిల్లలు స్కూళ్లకు వెళ్లాలని, బాలలను ఎవరైనా పనులలో పెట్టుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో గట్టప్ప, శ్రీరాములు, హరినాథ్, రెడ్డెప్ప, ఆసియా, సరస్వతి పాల్గొన్నారు.

### భక్తిప్రపత్తులతో రాహుకాల అభిషేక పూజలు



చౌడేపల్లె:పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి భక్తిప్రపత్తులతో రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయం శుద్ధి చేసి రాహుకాల సమయం 10.30 నుంచి 12 గంటల మధ్య అర్చనలు, అభిషేక పూజలు చేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. అనంతరం అమ్మవారిని బంగారు నగలు, రంగు రంగు పూలతో అలంకరించి దర్శనానికి అనుమతించారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

### ఎంఆర్‌పీఎస్ జెండా ఆవిష్కరణలు విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కిషోర్ మాదిగ

రొంపిచెర్ల: జూలై 7న ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాదిగపల్లెల్లో (అరుంధతివాడలు) ఎంఆర్‌పీఎస్ జెండాలను ఆవిష్కరించాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు ధనరాజుపల్లె కిషోర్ మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం రొంపిచెర్లలో ఎంఆర్‌పీఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఎస్సీ ఉపకులాల్లో అసమానతలు తొలగించడానికి, సమాన రిజర్వేషన్ల కోసం 30 ఏళ్లుగా ఎంఆర్‌పీఎస్ అలుపెరుగని పోరాటం చేసిందన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసమే కాకుండా ప్రజా సమస్యలపై సైతం పోరాటం చేసిన ఘన చరిత్ర ఎంఆర్‌పీఎస్‌కు ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతి మాదిగపల్లెలోనూ ఎంఆర్‌పీఎస్ జెండాలను ఎగురవేయాలని కోరారు. సమావేశంలో నాయకులు డాక్టర్ రఘునాథ్, గిరిబాబు, ఓబులేసు, మోహన్, సంగీతం గిరిబాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

### ఒత్తిళ్ల వలనే అధిక రక్తపోటు



సదుంలో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

సదుం: విద్యార్థి దశ నుంచే ఆరోగ్యకర ఆహార అలవాట్లు కలిగి ఉండాలని ఆరోగ్య విస్తరణాధికారి ఉదయ్‌కుమార్ అన్నారు. హైపర్ టెన్షన్ మాసోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అధిక రక్తపోటుతో అనేక సమస్యలు తలెత్తుతాయన్నారు. ప్రధానంగా ఒత్తిళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే జంక్ ఫుడ్, ఉప్పు వాడకం నియంత్రించాలని ప్రజలకు సూచించారు. ర్యాలీలో హెచ్ఎం జయకుమార్ రెడ్డి, టీచర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### ఒకే టీచర్.. ముగ్గురు విద్యార్థులు..!



కొండయ్యగారిపల్లె పాఠశాలలో ముగ్గురు విద్యార్థులతో టీచర్ సుధాకర్

చౌడేపల్లె: మండలంలోని కొండయ్యగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో నలుగురు విద్యార్థులున్నారు. శుక్రవారం పాఠశాలకు సాత్విక్, విష్ణుప్రియ, ఆద్యశ్రీదీక్ష మాత్రమే వచ్చారు. ఒక విద్యార్థి రాలేదు. ఇక్కడ పనిచేస్తున్న పీతాంబరం కౌన్సెలింగ్‌కు వెళ్లారు. మరో టీచర్ సుధాకర్ వచ్చిన ఆ ముగ్గురికీ పాఠాలు చెప్పారు. ప్రభుత్వ నిర్ణయాలతో పాఠశాలలు విద్యార్థులు లేక బోసిపోయాయని గ్రామంలో చర్చ సాగుతోంది.

---

అధికారంలో లేనప్పుడు ఒక లెక్క... అధికారంలోకి వచ్చాక ఓ లెక్క... అన్నట్లు మారింది ముఖ్యమంత్రి చంద్రబాబు తీరు. ప్రతిపక్ష హోదాలో పలు మార్లు పర్యటనల సందర్భంగా చంద్రబాబు అక్రమ గ్రానైట్ క్వారీలను సందర్శించి వాటిని మూసివేయాలంటూ ఏకంగా గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. దీనిపై అధికారులు అప్పట్లో చర్యలు తీసుకుని కొన్ని క్వారీలను మూసివేశారు. అదే చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా, తన నియోజకవర్గం కుప్పం నుంచి కోట్ల రూపాయల గ్రానైట్ బయటి రాష్ట్రాలకు తరలిపోతున్నా, పట్టించుకోవడం లేదు.

# కళ్లు మూసుకున్నావా బాబూ?

# దొడ్డి దారిలో గ్రానైట్ రైట్..రైట్..!

- అక్రమ క్వారీలపై ప్రతిపక్ష హోదాలో గ్రీన్ ట్రిబ్యునల్‌కు వెళ్లిన బాబు
- అధికారంలోకి వచ్చాక పట్టించుకోని వైనం
- నిత్యం అడ్డదారుల్లో ఎల్లలు దాటుతున్న గ్రానైట్ నిక్షేపాలు
- కూటమి నేతల అండదండలతో పేట్రేగిపోతున్న అక్రమార్కులు





పదుల సంఖ్యలో పక్క రాష్ట్రాలకు వెళ్తున్న గ్రానైట్ లారీలు

కుప్పం రూరల్: 2023లో ప్రతిపక్ష నాయకుడు హోదాలో చంద్రబాబు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో పర్యటించారు. తమ నాయకుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు శాంతిపురం మండలం, సి.బండపల్లె పరిసరాల్లో అక్రమ క్వారీలు నిర్వహిస్తున్న ప్రదేశాలను పరిశీలించారు. అక్కడి నుంచే గ్రీన్ ట్రిబ్యునల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అక్కడ జనంతో బాబు మాట్లాడుతూ ఖతమ ప్రభుత్వం వచ్చిన తరువాత ఒక్క గులక రాయి అక్రమంగా తరలిపోతుకుండా చర్యలు తీసుకుంటాం.. గ్రానైట్ తవ్వకాలను ప్రత్యేకంగా పర్యవేక్షించి అక్రమ రవాణాను అడ్డుకుంటాం౽౽ అని ప్రకటించారు. సీన్ కట్ చేస్తే- బాబు అధికారంలోకి వచ్చిన సంవత్సరం గడుస్తున్నా గ్రానైట్ అక్రమ రవాణాను పట్టించుకున్న పాపాన పోలేదు. పైగా, నిత్యం కుప్పం నియోజకవర్గం నుంచి పదుల సంఖ్యలో గ్రానైట్ లారీలు ఎల్లలు దాటుతున్నాయి.

**కూటమి నేతల అండదండలతోనే..!**

కుప్పంలో వంద వరకు అధికారిక, మరో 20 అనధికారిక క్వారీలు ఉన్నాయి. నిత్యం వీటిల్లో విలువైన గ్రానైట్ నిక్షేపాలు వెలికి తీస్తున్నారు. ఇలా తీసిన గ్రానైట్ దిమ్మెలకు పర్మిట్లు తీసుకుని బయటికి తరలించాల్సి ఉంది. క్వారీలు నిర్వహించాలన్నా అనుమతులు పొంది ఉండాలి. ఇవన్నీ ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో అక్రమార్కులు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ క్వారీలు నిర్వహిస్తూ, పర్మిట్లు లేకనే బయటికి రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఒక్కో పర్మిట్ పేరిట నాలుగైదు లారీలు తరలిపోతున్నాయి. పెద్ద ఎత్తున జాతీయ రహదారిపైనే గ్రానైట్ లారీలు దర్జాగా వెళ్తున్నా చర్యలు తీసుకునే నాథుడే కరువయ్యాడు. ఈ గ్రానైట్ తంతు వెనుక ఆయా ప్రాంతాల్లోన్ని కూటమి నేతలు ఉండడంతో అధికారులు అడ్డుకునేందుకు వెనుకడుగు వేస్తున్నారు.

**అడ్డుకట్ట ఎప్పుడు బాబూ అని ప్రశ్నిస్తున్న జనం**

పర్మిట్లు ఉన్న లారీలు పగటి పూట వెళ్తుండగా, పర్మిట్లు, అనుమతులు లేని గ్రానైట్ లారీలు రాత్రి పూట దొడ్డిదారుల్లో తమిళనాడులోని జగదేవి, హోసూరు, తిరుపత్తూరు, చెన్నై తదితర ప్రాంతాలకు వెళ్తున్నాయి. రాత్రిపూట పెద్ద పెద్ద శబ్దాలతో గ్రామాల మధ్య నుంచి వెళ్తుండడంతో జనం భయాందోళనకు గురవుతున్నారు. ఆ లారీలు వెళ్లే ధాటికి రోడ్లు ఛిద్రమైన గుంతలమయం అయ్యాయని జనం మండిపడుతున్నారు. బాబు మాటల్ని గుర్తు చేసుకుంటున్న జనం..కళ్లు మూసుకుని చూస్తున్నావా!? ఇంకెప్పుడు ఈ అక్రమ రవాణాకు చెక్ పెడతావు బాబూ? అని జనం ప్రశ్నిస్తున్నారు.

## నోటీస్ బోర్డు

**నేడు విద్యుత్ సరఫరా అంతరాయం**

- కుప్పం రూరల్: రెస్కో పరిధిలోని అన్ని మండలాల్లో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఎండీ సోమశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ సబ్ స్టేషన్లలో మరమ్మతుల దృష్ట్యా ఈ అంతరాయం ఉంటుందని తెలియజేశారు.

**పలమనేరు, గంగవరంలో..**

- పలమనేరు: పలమనేరు, గంగవరంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు పలమనేరు ట్రాన్స్‌కో ఏడీ జీవన్‌కుమార్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 33కేవీ లైన్ల మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని, అయితే మదర్ థెరీసా విద్యాసంస్థల్లో పరీక్షలు నిర్వహిస్తుండడంతో అక్కడ మాత్రం విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు.

**నేడు జాబ్ మేళా**

- కుప్పం రూరల్: కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఉదయం 10 గంటల నుంచి జాబ్ మేళా నిర్వహించనున్నట్టు బీసీఎస్ విద్యాసంస్థల చైర్మన్ బీసీ నాగరాజు తెలిపారు. మేళాలో ఐటీ, బ్యాంకింగ్, ఎడ్యుకేషన్ సెక్టార్ వంటి 15 కంపెనీలు రానున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలోని పట్టభద్రులే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని ఎవరైనా ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ, ఇంజినీరింగ్ పూర్తి చేసిన యువతీ యువకులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు ఇతర వివరాలకు 9603929625, 8106128762 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

**నేడు మెగా యోగా డే**

- పలమనేరు: యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా స్థానిక బాలికోన్నత పాఠశాలలో, పట్టణంలోని అన్ని సచివాలయాల్లో శనివారం ఉదయం 6 నుంచి 9గంటల వరకు మెగా యోగా డే నిర్వహించనున్నట్టు స్థానిక మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు, యువత పాల్గొని ఆరోగ్యానికి యోగాసనాల ప్రాధాన్యత గురించి తెలుసుకోవాలని కోరారు.

## కృష్ణారెడ్డికి ఎమ్మెల్యేల నివాళి



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సదుం: మండలంలోని జాంద్రపేటకు చెందిన రిటైర్డ్ హెచ్ఎం, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నల్లపరెడ్డిగారి కృష్ణారెడ్డి (78) మృతదేహానికి ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి శుక్రవారం నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. నివాళులు అర్పించిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి, సీనియర్ నాయకుడు కృష్ణారెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ తిమ్మారెడ్డి, బోయకొండ ఆలయ కమిటీ మాజీ సభ్యుడు భాస్కర్ రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, రమేష్ రెడ్డి, మనోహర్ రెడ్డి, శివారెడ్డి, రాజారెడ్డి, మోహన్ రెడ్డి, మల్‌రెడ్డి, పలువురు టీచర్లు ఉన్నారు.

## పనిచేయని సర్వర్

- రైతు సేవా కేంద్రంలో ఈకేవైసీకి అవస్థలు
- పడిగాపులు కాస్తున్న రైతన్నలు



రొంపిచెర్లలోని రైతు సేవా కేంద్రంలో ఈకేవైసీ సర్వర్ పని చేయకపోవడంతో వేచి ఉన్న వృద్ధులు

రొంపిచెర్ల: ఈకేవైసీ చేసుకునేందుకు రైతు సేవా కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో ఆర్థిక సాయం మంజూరు కోసం రైతు సేవా కేంద్రాలలో సుమారు 4210 మంది రైతులు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న రైతులు సైతం రైతు సేవా కేంద్రాలకు పరుగులు తీయాల్సి వస్తోంది. ఈకేవైసీ చేసుకునేందుకు మూడు రోజులే గడువు ఇచ్చారని, ఆ తర్వాత చేయడం కుదరదని రైతు సేవా కేంద్రం సిబ్బంది చెబుతుండటం, మరో వైపు సర్వర్ పనిచేయకపోవడంతో పడిగాపులు కాయాల్సి వస్తోంది. అంతేకాకుండా రైతు సేవా కేంద్రాలలో సబ్సిడీ వేరుశనగ విత్తనాలు ఇవ్వడం, ఈకేవైసీ చేయడం కష్టతరంగా ఉంటోందని సిబ్బంది వాపోతున్నారు. ఈకేవైసీకి గడువును పెంచాలని పలువురు రైతులు కోరుతున్నారు.

## అంగన్‌వాడీలకు చిన్నసైజు కోడిగుడ్లు..!



నాసిరకం గుడ్లు



చిన్నసైజు గుడ్డు

చౌడేపల్లె: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకంతో కూడిన చిన్న సైజు కోడిగుడ్లు సరఫరా చేశారని పిల్లల తల్లిదండ్రులు మండిపడ్డారు. శుక్రవారం కొండయ్యగారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో సరఫరా చేసిన గుడ్లు చిన్నసైజులో ఉండడంతోపాటు గుడ్లు ఎవరికీ విక్రయించకుండా ప్రభుత్వ సరఫరాగా తెలియజేస్తూ గుడ్లపై ఏదో ఒక రంగు పూయడం పరిపాటి. అలా రంగు పూయడం వలన వేరొకరికి విక్రయించడానికి అవకాశం ఉండదు. అయితే ఇక్కడ నిబంధనలకు తిలోదకాలిచ్చారని, గుడ్లను ఉడికిస్తే కుళ్లిపోయినట్లు దుర్వాసన వస్తోంద ని పిల్లల తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేశారు. సెలవుల కారణంగా పాత స్టాకు దించారనే అనుమానం వ్యక్తం చేశారు. ఇదలా ఉంచితే, కొండయ్యగారిపల్లె కేంద్రంలో ఉండాల్సిన గుడ్ల కంటే స్టాకు ఎక్కువగా దింపారని కార్యకర్త ఆదెమ్మ తెలిపారు.

## కల్యాణం..కమనీయం



ఆలయం వద్ద నిర్వహిస్తున్న కల్యాణోత్సవం

చౌడేపల్లె: మండలంలో సింగిరిగుంటలోని శ్రీ విజయ వినాయకస్వామి దేవస్థానంలో శుక్రవారం సిద్ధి బుద్ధి విజయ వినాయకస్వామికి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. వేద పండితులు ఆలయం వద్ద ప్రత్యేక హోమ పూజలు చేశారు. అనంతరం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా ముస్తాబుచేశారు. భక్తజన సందడి నడుమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. రాత్రి పుష్ప పల్లకిలో ఉత్సవమూర్తులను ఊరేగించారు. వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

## మహిళా కండక్టర్‌పై దాడి చేసి చెయిన్ స్నాచింగ్

పుంగనూరు(చౌడేపల్లె): విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా మహిళా కండక్టర్‌పై దాడి చేసి బంగారు చెయిన్ లాక్కుపోయిన సంఘటన పుంగనూరులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ..పుంగనూరు ఆర్టీసీ డిపోలో కండక్టర్ పనిచేస్తున్న మమత శుక్రవారం విధుల అనంతరం మినీ బైపాస్‌లో ఇంటికి నడచి వెళ్తుండగా పట్టణానికి చెందిన మురళి దాడి చేసి, ఆమె మెడలోని సుమారు 40 గ్రాముల బంగారు చైనును లాక్కొని ఉడాయించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వరకట్న వేధింపులు ముగ్గురిపై కేసు

పుంగనూరు (చౌడేపల్లె): అధిక కట్నం తేవాలని వేధిస్తున్న భర్త, అత్తమామలపై వరకట్నం వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లోకేష్ శుక్రవారం తెలిపారు. వివరాలు.. పుంగనూరు మండలం ఒంటిమిట్టకు చెందిన కె.మంజులను అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలం కలిబండ హరిజనవాడకు చెందిన టి. కుల్లాయప్పతో ఆరేళ్ల క్రితం వివాహం చేశారు. కొన్నేళ్లపాటు సజావుగా సాగిన వీరి కాపురంలో మనస్పర్థలు రావడంతో వేధింపులు మొదలయ్యాయి. అత్తమామలు రత్నమ్మ, ఉత్తయ్యలతోపాటు భర్త కలిసి రూ.4 లక్షలు అదనపు కట్నం తేవాలని రోజూ వేధిస్తూ చిత్రహింసలు పెట్టేవారని అందిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

## కారు–బైక్ ఢీ: ఒకరికి తీవ్రగాయాలు



చౌడేపల్లె: కారు–బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో మోటార్ సైక్లిస్టుకు తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం చౌడేపల్లె–సోమల మార్గంలోని ఆమినిగుంట సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం .. చంద్రగిరికి చెందిన కొందరు కారులో బోయకొండ గంగమ్మ దర్శనార్థం బయలుదేరారు. మార్గమధ్యంలో ఆమినిగుంట సమీపాన మేకలచిన్నేపల్లెకు చెందిన అగిస్తప్ప బైక్‌పై స్వగ్రామానికి వెళ్లేందుకు మలుపు తిరిగాడు. ఇదే సమయంలో ఎదురెదురుగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో అగిస్తప్పకు చేయి విరిగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతడిని ఢీకొన్న కారులోనే స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఇద్దరు వివాహితలు అదృశ్యం!

పుంగనూరు (చౌడేపల్లె): ఇద్దరు వివాహితలు అదృశ్యంపై వేర్వేరు కేసులు నమోదు చేసినట్లు పుంగనూరు ఎస్‌ఐ లోకేష్ శుక్రవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు..పుంగనూరు మండలం బర్నేపల్లెకు చెందిన 23 ఏళ్ల వివాహిత ఈ నెల 11 నుంచి, అలాగే కపాడమిట్టపల్లెకు చెందిన మరో 25 ఏళ్ల వివాహిత ఈ నెల 9న అదృశ్యమయ్యారు. కుటుంబ సభ్యులు, బంధువుల పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో ఆ వివాహితల తండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తాగునీటి సమస్యలు పరిష్కరించండి



హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు



సమావేశంలో జెడ్పీ చైర్మన్, ఎంపీపీ

- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీపీ యువరాజు

వి.కోట: మండలంలో పలు గ్రామాల్లో తాగునీటి సమస్యలు పీడిస్తున్నాయని, అవసరమైన చోట్ల బోర్లు వేసి దాహార్తి సమస్యలు పరిష్కరించాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీపీ యువరాజు ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత శాఖల వారీగా అధికారులు పురోగతిని నివేదించారు. ఎంపీపీ మాట్లాడుతూ, మండలంలో వేరుశనగ విత్తనాలను సగం మంది రైతులకే ఇచ్చారని, మిగిలిన రైతులకు ఇవ్వలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై సంబంధిత అధికారి బదులిస్తూ, రెండో విడత వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేస్తామన్నారు. సభ్యులు వివిధ సమస్యలను ప్రస్తావించారు. బైరుపల్లె పంచాయతీ బంగ్లాఊరులోని బోరులో నీటి మట్టం పడిపోవడంతో పంచాయతీ ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు సర్పంచ్ నివేదించారు. దీనిపై ఎంపీపీ స్పందిస్తూ, రీ–బోర్ చేయిస్తామని హామీ ఇచ్చారు. ఎంఈఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ, నాడు– నేడు కింద పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేశారని, ఈ విద్యా సంవత్సరంలో మండలానికి 40 ఆదర్శ పాఠశాలలు మంజూరయ్యాయని తెలిపారు.

**వీ.కోట ఆస్పత్రిలోనే పోస్టుమార్టం**

ముఖ్యఅతిథిగా జెడ్పీ చైర్మన్ మాట్లాడారు. వీ.కోట మండలంలో ఎవరైనా రోడ్డు ప్రమాదాలు, ఇతర కారణాలతో మృతి చెందితే పోస్టుమార్టం చేయడానికి 40 కిలోమీటర్ల దూరంలోని పలమనేరుకు వెళ్లాల్సి వస్తోందని, దీనికిగాను బాధితులకు రూ.20 వేల పైచిలుకు ఖర్చు అవుతోందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోనే పోస్టుమార్టం చేయడానికి ఆస్పత్రి యాజమాన్యం, అభివృద్ధి కమిటీ ప్రతిపాదనలు ఇవ్వాలన్నారు. సమావేశానికి గైర్హాజరైన పలు శాఖల అధికారులకు మెమోలు జారీ చేయాలని ఎంపీపీ ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ ప్రత్యేక ఆహ్వానితులు ఎస్ఎ గౌస్, వైస్ ఎంపీపీ లక్ష్మన్ రెడ్డి, ఎంపీడీఓ ఈశ్వరన్, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

## కొత్త భవనంలోకి మున్సిపల్ కార్యాలయం

- రూ.5 కోట్లతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణం
- అప్పట్లో మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభించినా తదనంతరం వినియోగంలోకి తీసుకురాని కూటమి ప్రభుత్వం
- ఎట్టకేలకు అద్దె భవనం నుంచి మోక్షం
- సోమవారం నుంచి కొత్త భవనంలో మున్సిపల్ పాలన



వైఎస్సార్ సీపీ పాలనలో నిర్మించిన మున్సిపల్ భవనం

కుప్పం: మేజర్ పంచాయతీగా ఉన్న కుప్పంను మున్సిపాలిటీగా గత ప్రభుత్వం పెంపుదల చేసింది. 1954లో నిర్మించిన పంచాయతీ భవనంలోనే కొత్త మున్సిపాలిటీ పాలన సాగుతుండేది. కుప్పం కొత్త మున్సిపాలిటీ కావడంతో పురపాలక సంఘం పాలన వ్యవస్థకు నూతన భవనం నిర్మించేందుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంలో రూ.5 కోట్లతో భవన నిర్మాణం మొదలెట్టింది. మున్సిపల్ చైర్మన్ ప్రత్యేక చాంబర్, సమావేశాలకు, అడ్మిస్ట్రేషన్‌కు, సిబ్బంది , స్టోర్ రూమ్..ఇలా అన్ని విభాగాలకు ప్రత్యేకంగా గదులు కేటాయించి నిర్మాణం పూర్తి చేశారు. స్థానిక ప్యాలెస్ రోడ్డులో పంచాయతీ కార్యాలయం ఉన్న చోటే దీనిని నిర్మించారు. గత ఎన్నికల ముందు నాటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం చోటుచేసుకున్న రాజకీయ పరిమాణాల మూలాన నూతన భవనంలోకి మున్సిపల్ యంత్రాంగం మారలేదు. కుప్పం మున్సిపాలిటీ అయ్యాక తొలిసారి వైఎస్సార్ సీపీ సభ్యులు కొలువుతీరారు. దీంతో నూతన హంగులతో కార్పొరేషన్ స్థాయి భవనం నిర్మించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అప్పట్లో భవనం నిర్మించింది. నాటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభోత్సవం సైతం చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిని వినియోగంలోకి తేకుండా ఏడాది కాలంగా నిరుపయోగంగా వదిలేసింది. అద్దె భవనంలోనే మున్సిపల్ కార్యాలయం కొనసాగింది. ఎట్టకేలకు ఈ భవనానికి మోక్షం లభించింది. నూతన భవనంలో మారడానికి అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది.

**పూజలు చేసి..సామగ్రి తరలిస్తూ..**

నూతన మున్సిపల్ భవనంలో శుక్రవారం మున్సిపాలిటీ అధికారులు పూజా కార్యక్రమాలు నిర్వహించి సామగ్రిని చేరుస్తున్నారు. ఇప్పటివరకూ బస్టాండు ప్రాంగణంలోని వైద్య విధాన పరిషత్ చెందిన భవనంలో ఇన్నాళ్లు అద్దెకు మున్సిపల్ కార్యాలయం కొనసాగింది. ఏడాదిగా అందులోకి తరలకుండా ఉండడంతో అద్దె రూపేణా ప్రజాధనం వృథా అయ్యింది. ఎట్టకేలకు మున్సిపల్ కార్యాలయం స్వంత భవనంలోకి ప్రవేశించింది.